

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త


# నెల్లూరు నగరంలో హత్య



**నెల్లూరు క్రైమ్, మే 6, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలో గత నెల రోజులుగా హత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. పోలీసు అధికారులు ఎన్ని రకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ శాంతి భద్రతలు మాత్రం అదుపులో ఉండడం లేదు. స్థానిక వేదయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో అయ్యప్ప గుడి కూడలి సమీపంలో మంగళవారం మరో హత్య ఉదంతం వెలుగులోకి వచ్చింది. పోలీసు తెలిపిన సమాచారం మేరకు.. ఉదయగిరి మండలం సర్వరాబాదుకు చెందిన గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ వికాస్ (40) గత కొంతకాలంగా అయ్యప్ప గుడి కూడలి సమీపంలోని తన స్నేహితుని ఇంట్లో అద్దెకు ఉంటూ నగరంలో రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతనితో పాటు వెంకటేశ్వర్లు మరో వ్యక్తి అదే ఇంట్లో ఉంటున్నాడు. సోమవారం రాత్రి బయట టిఫిన్ చేసి వచ్చిన ఇద్దరు ఇంటికి వచ్చి నిద్రకు ఉపక్రమించారు. చిన్నయ్య హాలులో నిద్రపోగా, వెంకటేశ్వర్లు గదిలో నిద్రపోయాడు. ఉదయం నిద్ర లేచి గదిలోంచి బయటికి వచ్చిన వెంకటేశ్వర్లు హాలులో విగతజీవిగా పడి ఉన్న చిన్నయ్యను గమనించి చుట్టుపక్కల వారికి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం తెలుసుకున్న నగర డి.ఎస్.పి సింధు ప్రియా, వేదయపాలెం ఇన్చార్జి సీఐ రోశయ్య సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్స్ స్క్వాడ్, క్లూస్ టీం సభ్యులు సంఘటన జరిగిన ప్రదేశంలో ఆధారాలను సేకరించారు. చిన్నయ్య మృతి వార్త తెలుసుకున్న బంధుమిత్రులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. చిన్నయ్యకు నగరంలో కానీ, తన సొంత గ్రామంలో గానీ ఎవరితోనైనా విభేదాలు ఉన్నాయమోననే క్రమంలో పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడు రాజా ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి వేదాయపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ పూర్తి చెయండి



**నెల్లూరు కలెక్టరేట్, మే 6, ప్రభాతవార్త** ప్రజలకు అందించే పౌర సేవలు గురించి ప్రభుత్వం అనునిత్యం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నందున అత్యంత జాగ్రత్తగా సేవలను అందించాలని సంబంధిత అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ సూచించారు. మంగళవారం తిక్కన ప్రాంగణంలో రీ సర్వే, డిజిటలైజేషన్, నోషనల్ ఖాతాలు, నీటి తీరువా పన్ను వసూలు, సిటిజన్ సర్వీసెస్ తదితర రెవిన్యూ సంబంధిత విషయాలపై ఆత్మకూరు డివిజన్ తహసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా రెవెన్యూ రికార్డులన్నింటినీ డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ సజావుగా జరిగేలా ముందుగా అందుబాటులో ఉన్న రికార్డుల జాబితా తయారు చేయాలన్నారు. ఆత్మకూరు డివిజన్లో మొత్తం 26,252 నోషనల్ ఖాతాలున్నాయని వాటిలో 449 ఖాతాలను సాధారణ ఖాతాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే రైతుల వద్ద నుండి నీటి తీరువా పన్నును వసూలు చేయాలని, పన్ను చెల్లించకపోతే ఆయకట్టు విస్తీర్ణ కొలతల్లో తేడాలు వచ్చే అవకాశం ఉందని రైతులకు అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందించే వివిధ రకాల పౌర సేవలు పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. పౌర సేవలకు సంబంధించి ఆయా లబ్ధిదారులకు నేరుగా ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయం సేకరిస్తున్నారన్నారు. అర్జీల పరిష్కారంలో ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఉదయభాస్కరరావు, ఆర్డిఓ పావని, సర్వే ఎడి నాగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తగు జాగ్రత్తలతో ఆస్తమాను అదుపులో ఉంచుకోవచ్చు




**నెల్లూరు, మే 6, ప్రభాతవార్త - వైద్యం** ఆస్తమా, ఆయాసం, ఉబ్బసం.. పేరు ఏదైనా ఆస్తమాను సత్వరమే గుర్తించి సకాలంలో చికిత్స మొదలు పెడితే దాన్ని అదుపులో ఉంచుకోవడంతో పాటు నిండు జీవితాన్ని హాయిగా గడపవచ్చని నెల్లూరు మెడికల్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ అండ్ స్లీప్ స్పెషలిస్టు డాక్టర్ జీఎల్ సుష్మితా రెడ్డి, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ కాటంరెడ్డి కౌషిక్ రెడ్డి ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా మంగళవారం మెడికవర్ హాస్పిటల్లో జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ సుష్మితా రెడ్డి, డాక్టర్ కౌషిక్ రెడ్డి మాట్లాడారు. మనిషి ముక్కు ద్వారా పీల్చే గాలి ఊపిరితిత్తులకు చేరుతుందని, ఆ క్రమంలో అవసరమైన ఆక్సిజన్ లభించిన తర్వాత మిగతా గాలిని శ్వాస కోశాలు బయటకు పంపిస్తాయని తెలిపారు. గాలి బయటకు స్వేచ్ఛ వెళ్లేందుకు శ్వాసకోశ నాళాలు భాగా వెడల్పుగా ఉంటాయని, ఆస్తమా వ్యాధి భారిన పడిన వారికి శ్వాస కోశ నాళాలు వాపునకు గురై సన్నగా కుదించుకుపోతాయని వెల్లడించారు. దీంతో శ్వాస తీసుకోవడం అతి కష్టంగా మారిపోతుందన్నారు. చల్లటి వాతావరణం, చల్లటి పదార్థాలు ఆస్తమా బాధితులకు శత్రువుగా చెప్పుకోవచ్చునని, దానికి తోడు జలుబు తోడైనప్పుడు ఆస్తమా మరింత తీవ్రం అవుతుందని డాక్టర్ జీఎ సుష్మితారెడ్డి, డాక్టర్ కౌషిక్ రెడ్డి పేర్కొన్నారు. జన్యుపరమైన సమస్యలు, ఎలర్జీ కాలుష్యం, పెంపుడు జంతువుల కారణంగా ఆస్తమా సోకుతుందని తెలియజేశారు. ఛాతి బరువుగా ఉండటం, విపరీతమైన దగ్గు, నిద్రలో పిల్లికూతల లాంటి గురక, ఆయాసం లాంటి లక్షణాలు ఉంటే దాన్ని ఆస్తమాగా గుర్తించాల న్నారు. అలాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఆస్తమాను నిర్లక్ష్యం చేస్తే మరణానికి కూడా దారి తీస్తుందని, ఇది దీర్ఘకాలిక వ్యాధికా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందని పేర్కొన్నారు. నెల్లూరు మెడికవర్ హాస్పిట ల్లో ఆస్తమాకు అధునాతనమైన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జీఎ సుస్మితా రెడ్డి, డాక్టర్ కౌషిక్రెడ్డి పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్రెడ్డి, పల్మనాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది, పీఆర్వో చందు వర్మ పాల్గొన్నారు.

## నేడు సోమశిల జలాశయం నుండి సాగునీరు విడుదల చేయనున్న మంత్రి ఆనం



**నెల్లూరు, మే 6, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు జిల్లా రైతాంగ రబీ రెండవ పంటకు సంబంధించి ఐఏబీ సమావేశపు నిర్ణయాల మేరకు బుధవారం ఉదయం 9.30గంటలకు సోమశిల రిజర్వాయర్ నుండి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సాగునీరు విడుదల చేస్తారు.

# సోషల్ వెల్ఫేర్ హాస్టల్ మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలి

- హాస్టళ్లలో నూటికి నూరుశాతం సీట్లు భర్తీ చేయండి
- టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలి
- హాస్టళ్ల సంక్షేమ అధికారులు, వార్డెన్లకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మే 6, ప్రభాతవార్త** జిల్లాలో సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల మరమ్మతు పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల మరమ్మతులు, ఈ ఏడాది పదోతరగతి ఫలితాలు, అడ్మిషన్లపై జిల్లాలోని హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, వార్డెన్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 64 హాస్టళ్లలో శ్లాబు, గోడల మరమ్మతులు, ఎలక్ట్రికల్, నీటిసరఫరా, కిటికీలు, తలుపుల మరమ్మతులు మొదలైన అత్యవసర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.9.32 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. పంచాయతీరాజ్శాఖకు 34, ఆర్అండ్బి శాఖకు 30 హాస్టళ్లను కేటాయించి త్వరగా పనులు పూర్తిచేయాలని ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులందరూ హాస్టళ్లకు తిరిగివచ్చేలోగా ఈ పనులన్నీ పూర్తికావాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అన్ని వసతులు కలిగి వున్న హాస్టళ్లలో నూటికి నూరుశాతం విద్యార్థులు చేరేలా ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎఎస్డబ్ల్యుఓలకు సూచించారు.

**హాస్టళ్లలో నూటికి నూరుశాతం సీట్లు భర్తీ అయ్యేలా కృషి చేయండి : కలెక్టర్..** హాస్టళ్లలో నూటికి నూరుశాతం సీట్లు భర్తీ అయ్యేలా ఎఎస్డబ్ల్యుఓలు, వార్డెన్లు ప్రత్యేక యాక్షన్ ప్లాన్తో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి ఎక్కువ మంది విద్యార్థులు హాస్టళ్లలో చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. సరైన వసతులు లేక తక్కువ విద్యార్థులున్న హాస్టళ్లను సమీపంలో మెరుగైన వసతులు కలిగి వున్న హాస్టళ్లతో అనుసంధానించాలని సూచించారు. జిల్లాలో సోషల్వెల్ఫేర్ హాస్టళ్లకు ప్రభుత్వం నిర్దేశించిన 5900 విద్యార్థుల సంఖ్యకు తక్కువ కాకుండా పూర్తిస్థాయిలో భర్తీ అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

**పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి : కలెక్టర్..** జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో ఈ ఏడాది సాధించిన పదోతరగతి ఫలితాలపై కలెక్టర్ ఆనంద్ సమీక్షించారు. కొన్ని హాస్టళ్లలో తక్కువ ఉత్తీర్ణతశాతం సాధించడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫలితాలు తగ్గడానికి గల కారణాలను తెలుసుకున్నారు. వచ్చే విద్యాసంవత్స రం నుంచి తరగతులు మొదలైన మొదటి నెల నుంచే విద్యార్థులపై పూర్థిస్థాయిలో పర్యవేక్షణ ఉంచాలని, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయాలన్నారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులకు వారికి అర్థమయ్యేలా ముందు నుంచే మెరుగైన బోధన అందించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని, హాస్టల్ పిల్లలను మన ఇంట్లో పిల్లలవలె భావించి వారి ఉన్నతికి కృషి చేయాలని కలెక్టర్ ఉద్బోధించారు. ఫెయిల్కైన విద్యార్థులందరూ టెన్త్ సప్లమెంటరీ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఎఎస్డబ్ల్యుఓలకు సూచించారు. ట్యూషన్లు పెట్టి సబ్జెక్టులవారీగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరక్టర్ శోభారాణి, పంచాయతీరాజ్, ఆర్అండ్బి ఇంజనీరింగ్ అధికారులు జి.రామకృష్ణ ప్రసాద్, సుబ్బరాజు, హాస్టళ్ల సంక్షేమ అధికారులు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపరి-చేలా కృషి




**కోవూరు, మే 6 ప్రభాతవార్త : సామాజికంగా**, ఆర్థికంగా వెనుకబడ్డ యానాదులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేయడంలో సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. విజయవాడలోని వెన్నెలకంటి రాఘవయ్య సమావేశ మందిరంలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ నిర్వహించిన పదవ గవర్నర్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో యానాదులు ఎంతో దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. 2016 సంవత్సరం నుంచి 2022 వరకు నేషనల్ షెడ్యూల్ ట్రైబ్స్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా కేవలం 72 మంది లబ్దిదారులకు రుణ సహాయం అందించిన గణాంకాలు చూస్తే ప్రభుత్వ పథకాలపై గిరిజనులకు ఉన్న అవగాహన రాహిత్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని యానాదులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూత పథకాలను సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పర్యవేక్షించడమే కాకుండా వారిలో మరింత అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గిరిజనులు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది పొందడంలో ఆధార్ ప్రధాన అవరోధంగా మారుతుందన్నారు. ఇప్పటికీ గిరిజనుల్లో చాలా మందికి బ్యాంక్ ఖాతాలు కూడా లేవని, అటువంటి వారిని గుర్తించి అధికారులు బ్యాంక్ ఖాతా తెరిచేలా చొరవ తీసుకోవాలన్నారు. కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట మండలంలో జిల్లా అధికారులు సంబంధిత మండల అధికారుల సహకారంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఈ మండలంలో ఉన్న గిరిజనుల పిల్లలకు ఆధార్ కార్డులు, పుట్టిన బర్త్ సర్టిఫికెట్లను అందించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె అధికారులకు తెలియజేశారు. ముఖ్యంగా గిరిజనులకు ప్రయోజనం చేకూర్చే దర్టీ జన్ జాతీయ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని కోవూరు నియోజకవర్గంలో ఉన్న 21 హ్యాబిటేషన్ గ్రామాల్లో వర్తించేలా ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ పథకం పట్ల నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి కూడా ఈ దిశగా కృషి చేస్తున్నారన్నారు. గిరిజన పిల్లలకు సంబంధించి హాస్టల్ కన్వర్టెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి స్థల సేకరణకు సంబంధించి కొడవలూరు, ఇందుకూరుపేట మండలాల తహసీల్దార్లకు ఇది వరకే సూచించడం జరిగిందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ పథకాలకు సంబంధించి ఏజెన్సీ ప్రాంతాలతో పోలిస్తే ఐటీడీఏ పరిధిలో ఉన్న జిల్లాలకు తక్కువ నిధులు కేటాయిస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఎస్సీ జనాభా 50 శాతం కంటే ఎక్కువగా ఉన్న గ్రామాలకు ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం ద్వారా అందించే 20 లక్షల ఆర్థిక ప్రోత్సాహం, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న గ్రామాలకు వర్తింపజేసేలా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు జిల్లాకు బాల బాలికలకు వేరువేరుగా రెండు జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆమె అధికారులను కోరారు. ఎమ్మెల్యే ఇచ్చిన సూచనలను సావధానంగా విన్న అధికారులు వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్యరూపం దాల్చేలా దృష్టి పెడతామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. గిరిజనుల సమస్యలపై సంపూర్ణ అవగాహనతో పాటు వారి సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఈ సందర్భంగా గిరిజనాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ప్రశంసించారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, మే 6 ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 50.706టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్సికి 50, ఎస్ఎఫ్సికి 30, పెన్నా డెల్టాకు 30, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.436మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# కూటమి ప్రభుత్వం 11 వేల కోట్ల భారీ కుంభకోణం

- ఆధారాలతో బయటపెట్టిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి




**నెల్లూరు రూరల్, మే 6, ప్రభాతవార్త**నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాత్రికేయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 11 నెలలకే భారీ వ్యతిరేకతను మూట కట్టుకుందన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి 11 నెలల్లో వరుస స్కామ్‌లతో టిడిపి నేతలు దోచుకోవడం మొదలెట్టారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయమని వైసిపి నేతలు ప్రశ్నిస్తుంటే కేసుల పేరుతో వారి నోరు నొక్కేస్తున్నారని అన్నారు. కుటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ల్యాండ్, ఇసుక, లిక్కర్, సిలికాను టిడిపి నేతలు అడ్డగోలుగా దోచుకుంటూ వేల కోట్ల రూపాయల అక్రమార్జనే ధ్యేయంగా చెలరేగిపోతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో 11 వేల కోట్ల అక్రమాలకు తెరలేపిందన్నారు. మే 2 వ తేది ఏపీ విద్యుత్ శాఖ అధికారులు యాక్సిస్ కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందమే. ఈ అవినీతికి బీజమన్నారు అన్నారు. ఇది భారతదేశంలో అతి పెద్ద స్కాం అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ వద్ద యూనిట్ విద్యుత్‌ను 2.49 పైసలకు వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేస్తే దాన్ని లక్ష కోట్ల కుంభకోణమని టిడిపి నేతలు నిందలు వేశారు. ఈరోజు టిడిపి ప్రభుత్వం యాక్సిస్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని యూనిట్ విద్యుత్తును 4.60 పైసలకు కొనుగోలు చేసి పేద ప్రజలపై 11 వేల కోట్ల అదనపు భారం వేసింది అన్నారు. ప్రభుత్వంలోకి రాకముందు చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచబోము తగ్గిస్తాము.. అవసరమైతే తగ్గిస్తామని చెప్పి.. ఈరోజు ప్రజల మీదే భారం మోపుతున్నారని అన్నారు. ఈరోజు కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పేదలపై విద్యుత్ సర్ చార్జీల పేరుతో ఇప్పటికే 15 వేల కోట్ల రూపాయలు వసులు చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో 5000 రూపాయలు విద్యుత్ బిల్లు వచ్చే వారికి 8000 రూపాయల బిల్లు వస్తుందన్నారు. ఈరోజు కూటమి ప్రభుత్వం 4.60 రూపాయలకు విద్యుత్ కొనుగోలు చేసి 25 సంవత్సరాలకు ఒప్పందం చేస్తుందని, దీంతో రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి గారు రైతులకు పగటిపూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని లక్ష్యంతో 7000 మెగావాట్ల విద్యుత్ ను 2.49 పైసలు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి 25 సంవత్సరాలకు అగ్రిమెంట్ కుదుర్చుకున్నారని తెలియజేశారు. ఇంత మంచి ఒప్పందాన్ని కుదుర్చుకున్న జగన్మోహన్ రెడ్డి గారిని అభినందించాల్సింది పోయి చంద్రబాబు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం యాక్సిస్ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని విద్యుత్ సంస్థలు ఎక్కడ వ్యతిరేకిస్తారో అన్న భావనతో టిడిపి ప్రభుత్వం 108 సెక్షన్ ను తీసుకువచ్చి దీన్ని కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఇది 11 వేల కోట్ల అతిపెద్ద కుంభకోణమని.. దుయ్యబట్టారు. అదే నెల మే 2 వ తేదీన కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకి.. రిలయన్స్ ఎనర్జీతో ఒప్పందం కుదుర్చుకొని, యూనిట్ విద్యుత్తును 3.40 పైసలకే కొనుగోలు చేసిన విషయం తెలీదా అని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థలకు చెందిన డిస్కంల్ నష్టాల్లో ఉంటే.. జగన్మోహన్ రెడ్డి 47,800 కోట్ల రూపాయలను డిస్కములకు చెల్లించి వాటిని ఆదుకున్నారని గుర్తు చేశారు. టిడిపి ప్రభుత్వం డిస్కములకు కేవలం 13,250 కోట్ల రూపాయలను మాత్రమే చెల్లించిందన్నారు. రైతులకు సంబంధించి 8840 కోట్ల విద్యుత్ బకాయిలను టిడిపి ప్రభుత్వం.. చెల్లించకుండా వదిలేస్తే వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని చెల్లించడం జరిగిందన్నారు. టిడిపి ప్రభుత్వ సమయంలో డిస్కం లు 86 వేల కోట్ల రూపాయలు అప్పులు ఉండగా వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత.. కేవలం 29 వేల కోట్ల రూపాయలు మాత్రమే అప్పులు ఉన్నాయన్నారు. ఇంకా టీడీపీలో జరుగుతున్న వరుస కుంబకోణాలు ఇసుక కుంభకోణం గత వైసిపి ప్రభుత్వం లో 80 లక్షల టన్నుల ఇసుక స్టాక్ పెట్టుకుంటే .. ఈరోజు కూటమి ప్రభుత్వ నేతలు దాన్నంతా దోచుకొ తిన్నారని మండిపడ్డారు. మద్యం మాఫియా ఈ రోజు 24 గంటలు 365 రోజులు మద్యం, బెల్ట్ షాపులు, పెరిగిపోయి మద్యం షాపుల్లో పరిమిట్ రూములు ఏర్పాటు చేసి సమయం సందర్భం లేకుండా విచ్చలవిడిగా 24 గంటలు మద్యాన్ని సరఫరా చేస్తూ ఏపీని మద్య ఆంధ్ర ప్రదేశ్గా మారుస్తున్నారని ఆరోపించారు. మద్యం మహమ్మారి కారణంగా పేద ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయి కుటుంబ కలహాలు ఏర్పడి అల్లాడిపోతున్నారని అన్నారుకేవలం నాలుగైదు నెలల్లోనే నెల్లూరులో 25 మర్డర్లు జరిగాయన్నారు. మైనింగ్ మాఫియా నెల్లూరులో మరోపక్క మైనింగ్ మాఫియా కూడా రెచ్చిపోతుందన్నారు. ఒక్క ఇసుక లారీని పట్టుకుంటే లక్ష రూపాయలు బహుమతి ఇస్తా అన్న మంత్రి టిడిపి నేత కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి 3 లారీలను పట్టుకున్నారు. కదా.. ఆ విషయం మంత్రికి గుర్తులేదా అని ప్రశ్నించారు. అమరావతి కాంట్రాక్ట్ సిండికేట్ అమరావతిలో కూడా రాజధాని పేరిట 15 వేల కోట్ల రూపాయలు విడుదల చేస్తే 8 శాతం 1200 కోట్లు కమిషన్ల రూపంలో కూటమి నేతలు దోచుకున్నారని మండిపడ్డారు. ఊర్సా కుంభకోణం ఉర్స భూ కుంభకోణం ఈమధ్య వార్తల్లోకి ఎక్కిందన్నారు. ఈ ఉర్సా భూకంభకోణం 3 వేల ఎకరాల భూమిని, కూటమి ప్రభుత్వం ఎకరా 99 పైసలకు అప్పనంగా కట్టబెట్టి ముడుపులు దండుకున్నారని దుయ్యబడ్డారు. అమరావతి ల్యాండ్ కుంభకోణం కూటమినేతలు రాజధాని పేరుతో 77 వేల ఎకరాలను సేకరించి రాజధాని లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇక బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీకి ఇచ్చే పథకాల్లో కూడా అవినీతి చోటు చేసుకుంటుంది అన్నారు. బీసీ మహిళల కుట్టు మిషన్ల కుంబకోణం బీసీలకు సంబంధించి లక్ష మందికి కుట్టుశిక్షణ, మిషన్ అందించేందుకు 230 కోట్ల లెక్కల్లో చూపి 170 కోట్లు దోచుకున్నారన్నారు. టిడిపి నేతలు ఈరోజు వారి వద్ద పనిచేస్తున్న వారికి స్కాములు పేరుతో దోచిపెడుతున్నారని మండిపడ్డారు. ఇదేమిటని ప్రశ్నిస్తున్న వైసీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయించి వారిని అణిచివేయాలని చూస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా విద్యుత్ ఒప్పందానికి ఉపసంహరించుకొని ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని లేదంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దీనిపై న్యాయపోరాటం చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హంజా హుస్సేని, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, జంగం సెల్ రాష్ట్ర అధ్యక్షులు వావిలేటి ప్రసన్న, కార్పొరేటర్లు కరిముల్లా, నీలి రాఘవరావు, కామాక్షి దేవి, జయలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వర రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి, వైసిపి యువజన విభాగం నాయకులు కిషన్, 11 డివిజన్ ఇన్ చార్జ్ మహేష్ యాదవ్, 5 వ డివిజన్ ఇన్ చార్జ్ సుబ్బారెడ్డి, మైనార్టీ నాయకులు అబ్దుల్ మస్తాన్, యస్థాని, అలీం, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కిశోరి వికాసం- వేసవిసెలవల కార్యక్రమం



**సంగం మే 6 ప్రభాతవార్త** సంగం మండలంలోని జెండాదిబ్బ మెయిన్ పంచాయితీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర్ బాలికల వికాసం- శిక్షణా కార్యక్రమం సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి నేతృత్వంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఐసిడిఎస్ ఆత్మకూరు ప్రాజక్టు అధికారిణి టి .అరుణ హజరైయ్యారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు కిషోర వికాసం వేసవి శిక్షణా కార్యక్రమాలను మే 2 నుండి జూన్ 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కిషోర బాలికలకు విద్య, ఆహారం ,పోటీతత్వం, నైపుణ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల వలన కలిగే దుష్ఫలితాలు ,కౌమరదశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు లింగ వివక్షత, అసమానతలు, సైబర్ నేరాలు, గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎం .చెంచమ్మ, టి లక్ష్మీ లావణ్య, డి లీలమ్మ, కిషోర బాలికలు పాల్గోన్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరం లైబ్రేరియన్ రాజేశ్వరి



**కొడవలూరు, మే 6, ప్రభాతవార్త :** స్థానిక గ్రంథాలయంలో విద్యార్థిని విద్యార్థులకు అవగాహనపై పాఠ్య పుస్తకాలను చదివించడంపై అవగాహన కార్యక్రమం లైబ్రేరియన్ రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు.

## వడదెబ్బ కారణంతో వ్యక్తి మృతి



**కొడవలూరు, మే 6, ప్రభాతవార్త :** మండలం దక్షిణ హరిజనవాడ గ్రామానికి చెందిన గుర్రాల లింగయ్య(65) మృతి వివరాలు ఇలా ఉన్నాయి నిత్యం కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న లింగయ్య చనిపోవడంతో కుటుంబీకులు శోక సముద్రంలో మునిగిపోయారు. మృతుడు జీవనాధారంపై కుటుంబ సభ్యులు జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో ప్రజలు లింగయ్య చనిపోవడం బాధాకర విషయం అని రోదించారు.

## సినీ నటి వరలక్ష్మి శరత్ కుమార్‌ని కలిసిన ప్రశాంతి



**కొడవలూరు, మే 6, ప్రభాతవార్త :** మండల కేంద్రం యల్లాయపాలెం గ్రామానికి చెందిన కప్పల పెంచలయ్య కుమార్తె ప్రశాంతి మంగళవారం చెన్నైలో సినీ నటి వర లక్ష్మి శరత్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలవడం జరి గింది. కొద్దిసేపు పలు అంశాలపై మాట్లాడడం జరిగిందని ప్రశాంతి తెలిపారు. అనంతరం ప్రముఖ సినీ నటికి సన్మానం చేసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## ఆధార్ నమోదు పర్యవేక్షణ : ఎంపీడీవో



**విడవలూరు, మే 6, ప్రభాతవార్త** మండలం రామతీర్థంలో గ్రామంలో ఎస్టి కాలనీలో ఎంపీడీవో నగేష్ కుమారి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో నగేష్ కుమారి మాట్లాడుతూ ఆధార్ కార్డులు లేని వారు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరై ఆధార్ నమోదు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఆధార్ కార్డులో తప్పిదాలు, ఎటువంటి లోటుపాట్లు ఉన్న సవరించడం జరుగుతుందని. కావున గ్రామస్తులు ఈ సవరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంకా ఎవరైనా గ్రామస్తులు అందుబాటులోకి లేక ఉన్న పరిస్థితులు విడవలూరు తాసిల్దార్ వద్ద ఆధార్ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అత్తంటివారిపాలెం సచివాలయం తనిఖీ అడ్రస్‌లేని వీఆర్వో



వలేటివారిపాలెం మే 6 ప్రభాతవార్త మండలంలోని అత్తంటివారిపాలెం సచివాలయంను మంగళవారం స్దానిక ఎంపీడీవో కె.నరేంద్రదేవ్ ఆకస్మికంగా తనిఖీచేశారు.మండలంలోని పలు సచివాలయాల పనితీరు అధ్వానంగా ఉంది.సిబ్బంది తరచూ గైరు హాజరు అవుతన్నారు.దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.పభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ఈ నేపద్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పలు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. నిర్లక్ష్యదోరణిని గమనించారు. సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు.ఈ సమాచారం తెలుసుకున్న నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఎంపీడీవో నరేంద్రదేవ్‌ని వివరణ కోరారు.సచివాలయాలపై అజమాయిషీ చేయాల్సిన ఎంపీడీవో విఫలమవుతున్నారన్న అపఖ్యాతిని మూటకట్టుకున్నారు.ఈ నేపద్యంలో ఎంపీడీవో సచివాలయాల సిబ్బంది పనితీరును గాడిపెట్టాలని బావిస్తున్నారు. ఇందులో బాగంగా మంగళవారం ఆయన మండలంలోని అత్తంటివారిపాలెం సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.హజరు పట్టీని పరిశీలించారు.అయితేఇందులో వీఆర్వో గైరు హాజరయ్యారు.ఈ విషయమై ఆయన వీఆర్వో విధులను ఆరా తీశారు. సదరు వీఆర్వో తహసిల్దార్ అజమాయిషీలో ఉన్నట్లు తెలుస్తుంది. తహసిల్దార్ పరిధిలో గల పలువురు వీఆర్వోలు రిజస్టర్‌లో సంతకాలు పెట్టడం లేదు.అయినా తహసిల్దార్ పరిధిలో ఉన్నారని ఎంపీడీవో పట్టించుకోవడంలేదు. పలితంగా వీరు ఎక్కడ విధుల్లో ఉంటారో తెలియడం లేదు.దీంతో ప్రజలు వీరి ఆచూకి తెలియక ఇబ్బంది పడుతున్నారు.నిబందనలమేరకు ఏ సచివాలయానికి కేటాయించారో ఆ సచివాలయంలోనే ఆయన ఉండాలి.ఏదైనా ఇతరత్రా పనులుపై వేరే ప్రాంతాలకు వెళ్లాల్సివస్తే సంబంది సచివాలయ హెడ్‌కి తెలియచేయాలి.మూవ్‌మెంట్ రిజస్టర్‌లో నమోదు చేయాలి. నిబందనలు ఇలా ఉంటే సదరు వీఆర్వోలు ఇవేమి పట్టనట్లు వ్యవహరించడం అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడతున్నారు.సచివాలయ విధులకు హాజరైనపుడు సంబందిత సచివాలయ రిజస్టర్‌లో తప్పనిసరిగా సంతకం చేయాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ అన్నారు.

## కిశోరబాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి



**ఆత్మకూరు,మే6,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని క్రిస్టియన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసం-వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా కిశోరబాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సెక్టార్ సూపర్‌వైజర్ రత్నమ్మ పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్త కె.సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరబాలికలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రమైన కాటన్ గుడ్డముక్కను వాడాలన్నారు. నెలసరిలో ఉపయోగించిన గుడ్డలను ఎప్పుడూ ఎండలో ఆరనివ్వాలన్నారు. పాతగుడ్డలను పారవేసేటప్పుడు కవర్‌లో కట్టి చెత్తకుండీలో వేయాలన్నారు. సానిటరీ పాడ్స్‌ను ప్రతి నాలుగైదు గంటలకు ఒకసారి మార్చుకోవాలన్నారు.ఆడపిల్లలు నెలసరి సమయంలో ఐరన్, ప్రొటీన్ సమృద్ధిగా ఉండేలా మంచి సమతుల ఆహారాన్ని తీసుకోవాలని, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే శాఖాహారం, మాంసాహారం తీసుకోవాలన్నారు. నెలసరి సమయంలో నీటిని ఎక్కువగా తాగాలన్నారు. ఈ జాగ్రత్తలను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, నారాయణమ్మ, చెంచమ్మ, హెల్పర్లు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

## అప్పారావుపాళెంలో కిశోరవికాసం



ఆత్మకూరు,మే6,ప్రభాతవార్త: మండలంలోని అప్పారావుపాళెం హెచ్‌డబ్ల్యు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి ఆధ్వర్యంలో కిశోర వికాసం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి సెక్టార్ సూపర్‌వైజర్ ఎన్.నాగేశ్వరమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత గురించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారు రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయరాణి, శ్రీజ్యోతి ,హెల్పర్లు, కిశోరబాలికలు, మహిళలు పాల్గొన్నారు.

## గౌరవరంలో కిశోరవికాసం



**అనంతసాగరం,మే6,ప్రభాతవార్త:** మండలంలోని గౌరవరం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆధ్వర్యంలో కిశోరవికాసం శిక్షణా కార్యక్రమాన్ని మంగళశారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సెక్టార్ సూపర్‌వైజర్ శారదమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. అదేవిధంగా ఆసమయంలో ప్రొటీన్లు ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరబాలికలు,మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## సినిమా డైరెక్టర్‌గా రాజుపాళెం కుర్రోడు




**మర్రిపాడు,మే6,ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం చుంచు లూరు రాజుపాళెం గ్రామానికి చెం దిన యల్లంరాజు మోహన్ రా జు-ఉమారాణి దంపతుల కుమా రుడు రాకేష్‌వర్మ డైరెక్టర్‌గా ఆరంగేట్రం చేశాడని చుంచులూరు వా సులు ఆనందం వ్యక్తం చేశారు. నవీన్‌చంద్ర, రాశిసింగ్ హీరో హీరోయిన్‌లుగా రవివర్మ, గాయత్రి భార్గవి ప్రధాన పాత్రదారులుగా రామకృష్ణ వీరపనేని నిర్మాణ సారథ్యంలో బ్లైండ్ స్పాట్ సినిమాతో రచయిత, దర్శకునిగా ఆరంగేట్రం చేశారు. ఈసినిమా ఈనెల 9వ తేదీన విడుదల అవుతుందని ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన రాకేష్ వర్మ సినిమా డైరెక్షన్‌పై మక్కువతో హైదరాబాదులోని ప్రముఖ దర్శకుడు ఉమామహేశ్వర్‌రావ్ సార థ్యంలోని దాదాసాహెబ్ పాల్కే ఫిల్మ్ ట్రైనింగ్ ఇన్స్‌ట్యూట్‌లో డైరెక్టర్‌గా శిక్షణ పొందాడు. అనంతరం పలు షార్ట్ పిల్మ్‌లకు దర్శకత్వం వహించారు. ఈనేపథ్యంలో రాజుపాళెం, చుంచలూరు, పడమటినాయుడుపల్లి తదితర గ్రామాల ప్రజలు అభినందనలు తెలిపారు. ఈసినిమా విజయం సాధించాలని , రాబోయే రోజుల్లో రాకేష్ వర్మ గొప్ప దర్శకుడిగా రాణించాలని వారు కోరారు.

## ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై గ్రామంలో ర్యాలీ



సీతారామపురం **మే6,ప్రభాతవార్త:** సీతారామపురం మండల పరిధిలోని బసినేనిపల్లి పంచాయితీలోని ఏసి నగర్ రెండు గ్రామ సంఘాల పరిధిలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ మల్లెల సురేష్,యూనిట్ ఇంచార్జి బక్కా రవి ఆద్వర్యంలోఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025 -26లో భాగంగా రైతులు మహిళా సభ్యులతో కలిపి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సభను నిర్వహించి రైతు మహిళా సభ్యులతో అందరు ప్రకృతి వ్యవసాయం చేయాలని ఈ వ్యవసాయంలో మొదట పిఎండిఎస్ 30 రకాల విత్తనాలతో పంట వేసిన అనంతరం ప్రధాన ఖరీఫ్ రబీ పంటలలో కనీసం ఏకరా పొలంలో 5 రకాల పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు. అందరు ఆరోగ్యకరమైన పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా అందరికి అరోగ్యం బాగుంటుందని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ముగ్గురు ఉత్తమ రైతులు ఆకులు శ్రీనివాసులు, ఎ.చిన్నా, మౌలాలి,ఆదాం,సియోను.యోహానులకు శాలువాల కప్పి సన్మానించారు.గ్రామ రైతులలో నలుగురు కెపిఎం డిఎస్ విత్తనాల సంచులు అందజేశారు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎల్ మాలిబాబు,పద్మ,దేవసహాయం,కళ్యాణ్,గ్రామ పెద్దలు రైతులు మహిళలు పాల్గోన్నారు.

## ఉదయగిరిలో ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

**- ముస్లిం మైపార్టీ నాయకులు ఆధ్వర్యంలో తహశీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందజేత**




**ఉదయగిరి, మే 6, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం నేషనల్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉదయగిరి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ ఎం.సుభద్ర వినతిపత్రం అందజేశారు. ఎంతో కాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు దఫాలు రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు చేపట్టామని ఇప్పటికి సమస్య పరిష్కారం కాలేదని సంఘం నాయకులు వాపోయారు. ఈ కార్యక్రమంలో మంజుదార్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఋతుక్రమం, పరిశుభ్రతపై అవగాహన



ఉలవపాడు, మే 6, ప్రభాతవార్త ఉలవపాడు మండలంలోని కరేడు సెక్టారులోని ఆత్మకూరు పంచాయతీలోని ఆత్మకూరు-1 అంగన్‌వాడీ కేంద్రం నందు 11-14, 15-18 సంవత్సరాల కిశోరి బాలికలకు ఋతుక్రమం, పరిశుభ్రత, ఋతుస్రావం, అపోహలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యవంతమైన కుటుంబానికి ఆరోగ్యవంతమైన తల్లి, కౌమర బాల బాలికలకు ప్రత్యేక వైద్యశాలలు, ప్రతి బాలిక, మహిళ ఋతుక్రమంలో పాటించాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత శానిటరీ పాడ్స్ ఉపయోగం గురించి సూపర్‌వైజర్ ఎం.నాగలక్ష్మి కిశోరి బాలికలకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నాళం గోవిందమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిరావతి, వెంకటరత్నం, సుజాత, శేషమ్మ, తల్లులు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

## కిషోర్‌బాలికలుకు అవగాహన



వలేటివారిపాలెం మే 6 ప్రభాతవార్త కిషోర్‌బాలికలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సీడీపీవో శర్మిష్ట సూచించారు. మంగళవారం మండలంలోని నూకవరం, బడేవారిపాలెం గ్రామాల్లో కిషోర్‌బాలికలకు అవగాహన సదస్సులు నిర వ్వహించారు. స్దానిక సూపర్‌వైజర్ సునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార దశలోని బాలికలు రుతుస్రావం సమయంలో పరిశుభ్రత పాటించాలన్నారు.ఆరోగ్యం,పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లావణ్య, మహిళాపోలీస్ మృధుల, సుమలత, అనిత రమ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గండిపాలెం ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆశా కార్యకర్తల ఆశాడే కార్యక్రమం




ఉదయగిరి, మే 6,ప్రభాతవార్త ఉదయగిరి వ్యాక్సిన్ రూమ్ నందు వైద్యాధికారిణి డాక్టర్ ఎం.శివ కల్పన ఆధ్వర్యంలో నిర్వహించడమైంది. ఈ సందర్భంగా ఆమె ఆశా కార్యకర్తలకు రీ ఓరియంటేషన్ ట్రైనింగ్ ఇవ్వడం అయింది. ముఖ్యంగా ఆశా కార్యకర్తలకు నూతనంగా ప్రవేశపెట్టిన యాప్‌ల గురించి, న్యూ మాడ్యూల్ గురించి, ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ గురించి, గ్రామీణ ఆరోగ్య పారిశుధ్య, పోషకాహార కమిటీ గురించి, గ్రామీణ ఆరోగ్య పారిశుధ్య, పోషకాహార కమిటీ గురించి, గ్రామీణ ఆరోగ్య పారిశుధ్య న్యూట్రిషన్ డే గురించి ఆశా కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాలలో వారి విధి నిర్వహణలో ప్రజలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. గర్భవతుల నమోదు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు, గర్భవతి కాలంలో అందజేసే పారితోషికం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య, సీహెచ్‌ఓ శివకుమారి, పర్యవేక్షకులు చెన్నయ్య, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కిశోరి వికాసంపై అవగాహన



**ఉదయగిరి, మే 6, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య కార్యకర్త విజయ్ కుమారి అంగన్‌వాడీ కార్యకర్త మహాలక్ష్మీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిశోరి బాలికల సాధికారిత అందరి బాధ్యత అన్నారు. సంపూర్ణ ఆరోగ్యం నాణ్యమైన విద్య, పరిశుభ్రత బాల్య వివాహాలు వేదింపులు ఆత్మ రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం, శుక్రవారంలో గ్రామ స్థాయిలో కిశోర బాలికలకు చైతన్య కార్యక్రమాలు జరుపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ఆకలి తీర్చిన గంధం ప్రసన్న

**కావలిరూరల్, మే6 ప్రభాతవార్త**



కావలి ఇందిరానగర్ నివాసులు, మాజీ కౌన్సిలర్ గంధంప్రసన్నాంజనేయులు, రేవతి దంపతుల కు మార్తె గంధం పూర్ణాంజని పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం సంయుక్త సేవాసంస్థ కార్యాలయం నందు చదువుకుంటున్న పేద విద్యార్థుల ఆకలి తీర్చడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అద్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. దాతలు గంధం ప్రసన్నాంజనేయులు, రేవతి దంపతులు సంయుక్త సేవాసంస్థ స్థాపించిననాటినుంచి ఇప్పటివరకు సంస్థ సభ్యులుగా ఉంటూ పేదలకు అనేక రకాలైన సేవలందిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని తెలియచేశారు. ఎంతో మందికి గంధం ప్రసన్నాంజనేయులు తమ రక్తం ద్వారా ప్రాణదానం చేశారని తెలియచేశారు. దీనిలో భాగంగా వారి కుమార్తె గంధం పూర్ణాంజని పుట్టినరోజును పురస్కరించుకుని సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలియచేశారు. చిన్నారి గంధం పూర్ణాంజనికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బాలు క్రియేషన్స్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగునికి నిత్యావస సరుకులు పంపిణి

**కావలిరూరల్, మే6 ప్రభాతవార్త**



హ్యాపీసేవాసంస్థ ఉపాధ్యక్షుడు విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం హ్యాపీసేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి ఇందిరానగర్ 22వ వార్డులో నివాసముంటున్న కసుకుర్తి ప్రతాప్ అనే దివ్యాంగుడు కుటుంబానికి రైస్‌బ్యాగ్, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా హ్యాపీసేవా సంస్థ సభ్యులు సయ్యద్ ఘనిబాషా మాట్లాడారు. కసుకుర్తి ప్రతాప్ సతీమణి కసుకుర్తి లలితకు ఇటీవల ఫిట్స్ వచ్చి నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్ నందు గత 20 రోజులుగా చికిత్సపొంది ఇంటికి చేరుకున్నందున వారి పరిస్థితులు, వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని హ్యాపీసేవాసంస్థ ఆ కుటుంబానికి అండగా ఉండాలని సేవాసంస్థ ఉపాధ్యక్షులు విజయ్ దాతృత్వంతో వారికి బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణి చేయడం చాలా సంతోషంగా ఉందని తెలియచేశారు. విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో హ్యాపీసేవాసంస్థ ఉపాధ్యక్షులు విజయ్ దేవరకొండ, సంస్థ సలహాదారులు చేవూరు ప్రభయ్య, భరత్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

## 20న జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**తోటపల్లిగూడూరు, మే 6, ప్రభాతవార్త**



మేడు వారోత్సవాల్లో భాగంగా తోటపల్లిగూడూరు మండలం కోడూరు పీహెచ్‌సీ, వరిగొండ పీహెచ్‌సీలో ఆశావర్కర్స్ మండల నాయకులు మధుసూదనమ్మ రేణుకమ్మల ఆధ్వర్యంలో సీఐటీయు జెండా విష్కరించిన అనంతరం దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ 20 దేశ వ్యాప్తంగా కార్మికులు సమ్మె చేస్తున్నారని కార్మికులను యజమానులు కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోర్సు రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని ఆశలతో పాటు స్కీం వర్కర్లు కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఒప్పంద జీవోలు విడుదల చేయాలని చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్స్‌తో కేంద్ర, కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20 జరుగుతున్న దేశభక్త సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయు టీపీ గూడూరు మండల కార్యదర్శి మారుబోయిన రాజ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాల కోసమే చట్టాలను మార్పు చేస్తున్నామంటూ 150 ఏళ్ల క్రితం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలలో కార్మికులకు ఉపయోగపడే అంశాలను తొలగించే లేబర్ కోడ్స్ తెచ్చింది. ఈ అవకాశంతో పెట్టుబడిదారులు వారానికి 48 గంటలుగా ఉన్న పని విధానాన్ని 72 గంటల నుంచి 90గంటలకు పెంచాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నారని వేతనాల కోసం కార్మికులు బేరసారాలు ఆడే హక్కులు తొలగిస్తున్నారని నిధులు ఎగ్గొట్టిన యజమానులు కాంట్రాక్టర్లపై ఏ విధమైన శిక్షలు ఉండవని, ఏదో ఒక కుంటి సాకుతో యూనియన్ల గుర్తింపు రద్దు చేస్తున్నారని కార్మిక వర్గం జన్మ హక్కు అయిన సమ్మె హక్కును తొలగిస్తున్నారని ఈ తరుణంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో పాటు ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే విధానాలకు మన రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు వంత పాడుతున్నాయని ఈ ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పి కొట్టేందుకు కార్మిక హక్కుల సాధనకై దేశంలోని యావత్తు కార్మిక వర్గం సంఘటితంగా పోరాడుతుందని అందుకోసమే మే 20న జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో ఆశ వర్కర్స్ అందరూ విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ఉచిత ఖత్నా కార్యక్రమం విజయవంతం

**ఉదయగిరి, మే 6 ,ప్రభాతవార్త**



పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం చిన్న మసీదు కమిటీ ఆధ్వర్యంలో రహంతుల్లా ఆలమే ట్రస్టు సౌజన్యంతో ముస్లిం చిన్నారులకు ఖత్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు వంద మంది చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్ మాట్లాడుతూ చిన్న మసీద్ కమిటీ వారు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సామాజిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి ఏడాది నిర్వహిస్తుంటామని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి ఏడాది నిర్వహిస్తుంటామని ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు, కరస్పాండెంట్ సయ్యద్ ఖాజా మొయినుద్దిన్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జనవిజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడిగా మున్నా



**ఉదయగిరి, మే 6, ప్రభాతవార్త** సైన్స్ ప్రచార ఉద్యమ సంస్థ జనవిజ్ఞాన వేదిక నూతన ఉదయగిరి పట్టణ అధ్యక్షుడిగ షేక్ గాజుల మున్నా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక సాది మంజిల్ నందు జరిగిన కమిటీ సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా షేక్ గాజుల మున్న, ప్రధాన కార్యదర్శిగా మసూద్, గౌరవ అధ్యక్షులుగా ఓబుల్‌రెడ్డి, నసురుల్లా, ఉపాధ్యక్షులుగా భాస్కర్‌రెడ్డి, ఖాజా పీర్, కార్యదర్శులు షబ్బీర్ అశోక్, మహమ్మద్ అలీ, కోశాధికారి సురేష్‌లను నియమించారు. ఈ సమావేశంలో జనవిజ్ఞాన సీనియర్ నాయకులు దస్తగిరి అహ్మద్, శ్రీనివాసులురెడ్డి, జిలాని, చక్రపాణి, గాజులపల్లి రామిరెడ్డి, జమీర్, గౌస్ భాషా సమక్షంలో జరిగింది

## ఆస్తమా పట్ల అవగాహన తప్పనిసరి

**వింజమూరు, మే 6 ,ప్రభాతవార్త**



వింజమూరులోని డాక్టర్ మాశిలామణి వైద్యశాల నందు మంగళవాం ప్ర పంచ ఆస్తమా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల వైద్యాధికారి కే.మాశిలా మణి మాట్లాడుతూ ఆస్తమా వయసుతో సంబంధం లేకుండా శిశువుల దగ్గర నుండి పండు ముసలి వరకు రావచ్చని ఇది దీర్ఘకాలిక వ్యాధి అని అన్నారు. ఊపిరి తిత్తులలోని గాలి గొట్టాల సమస్య దుమ్ము దూళి లోకి వెళ్లినప్పుడు దగ్గురావడం, మామూలు అయితే ఆస్మా వచ్చే స్వభావం గల వారికి ఇలాంటి చిన్న విషయాలే నేడుసమస్యగా ఉంటాయ న్నారు. ఉబ్బసం అంత ప్రమా దకరమైంది కాదని ప్రస్తుతం సమర్ధవంతమైన చికిత్సలు ఉన్నాయని, రోజు వారి పనులు చేసుకుంటూనే ఉబ్బసానికి సంబంధించిన జాగ్రత్తలు పాటిస్తూ జీవించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహనతో వాతావరణ కాలుష్యాన్ని ఆహార అలవాట్లు జంక్ ఫుడ్ ఒత్తిడితో కూడిన పనులు చేయటానికి అపరిశుభ్ర పరిసరాలు శీతల పానీయాలు ధూమపానంకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభంగా ఉంటుందన్నారు. వ్యాధి ముదిరినట్లయితే దీర్ఘకాలిక వ్యాధి చికిత్స అవసరం ఉందన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు ఆస్మా భారిన పడుతున్నారని చిన్నారి తల్లిదండ్రులు వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, హెప్సిబా, మల్లిఖార్జున, కీర్తన, సుజిత్, దీన, ప్రేమలీల, తిరుమలేశు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే దృష్టికి రేషన్ డీలర్ సమస్య

**వింజమూరు, మే 6, ప్రభాతవార్త**



వింజమూరు మండలం శంఖవరం పంచాయతీకి సంబంధించిన రేషన్ డీలర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి చెందిన సమయానికి 750 కేజీల బియ్యం రేషన్ షాపులో తక్కువగా ఉన్నాయి. బియ్యం తక్కువగా ఉన్నందున గ్రామస్తులకు రేషన్ సరిగా అందడం లేదు. అందుచేత గ్రామస్తులు తరచూ ఫిర్యాదు చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు పార్టీకి చెడ్డ పేరు వస్తుందని, గ్రామ నాయకులతో ఎమ్మెల్యే కాకర్ల దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులకు విషయాన్ని తెలియపరిచి, పొదుపు గ్రూపు లీడర్ల ద్వారా రేషన్ సరఫరా అందరికి అందే లాగా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో సమస్య పరిష్కారమైంది. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి

**బిట్రగుంట మే 6 ప్రభాతవార్త** అవినీతి వ్యతిరేక చట్టాలు పై అవగాహన పెంచుకొని మహాత్మా గాంధీ కలలు కన్నా అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలని లోక్ సత్తా ఉద్యమ నేత యం.మలకొండా రెడ్డి కోరారు . అవినీతి వ్యతిరేక చట్టాల పై ప్రజలు అవగాహన పెంచుకోవాలి అని కోరారు .మన దేశ ఆర్థిక , రాజకీయ, సామజిక పురోగతి కి అవినీతి ఒక ప్రధాన అవరోధము అని తెలిపారు . ముఖ్యముగా అవినీతి నియంత్రించడానికి కేంద్రస్తాయిలో సి.వి.సి , సి.బి.ఐ ,లోక్ పాల్ రాష్ట స్తాయి లో ఎ.సి.బి, సి.ఐ.డి, లోకయుక్తా ద్వారా అవినీతిని నిర్మూలించడానికి కృషి చేస్తున్నారని అన్నారు. లంచం ఇవ్వడము తీసకోవడము నేరం అని తెలిపినారు.పెరుగుతున్న అవినీతి ని నియంత్రణ చేయడానికి ప్రజా ప్రతినిధులు , పౌర సంస్థలు నిరంతరం కృషి చేయాలని కోరారు .

## గణితం పట్ల భయం విడనాడాలి

**వింజమూరు, మే 6, ప్రభాతవార్త**



గణితం పట్ల ఉన్న భయాన్ని విడనాడి గణితంలో సులభమైన చిట్కాలు మెలుకువలు నేర్చుకుంటే సాధన చేయడం సులభతరం అవుతుందని ప్రభుత్వ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాయబ్ రసూల్ తెలిపారు. గ్రంధాలయ వేసవి విజ్ఞాన శిబిరంలో 8వ రోజు సులభగణితం కార్యక్రమం నిర్వహించారు. గ్రంధాలయ అధికారి జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు గణితంలో ఉన్న మెలుకువలను చిన్న చిన్న చిట్కాలను వివరించి గణిత సమస్యలను ఏ విధంగా సులభంగా సాధించవచ్చును తెలియజేసినట్లయితే గణితం పట్ల ఆసక్తి కలిగి ఉంటారన్నారు. అలాగే గణితంపై ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాల్సి ఉందన్నారు. గణితంలో చిట్కాలు ఏ విధంగా సాధించాలని అనేక పుస్తకాలు ఉన్నాయని వాటిని ప్రయోగ పూర్వకంగా చేయించినట్లయితే త్వరగా నేర్చుకొనే వీలుంటుందన్నారు. విద్యార్థులు ఉన్నారు.

## జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడుగా మోహన్‌రెడ్డి



**కోవూరు, మే 6 ప్రభాతవార్త :** కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెట్రంబాక మోహన్‌రెడ్డి మంగళవారం నెల్లూరులో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడుగా , పార్టీ సీనియర్ నాయకుడు, అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ తనకు అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత పట్టు పెంచేలా తనవంతు చర్యలు తీసుకుంటానన్నారు. మోహన్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడుగా ఎన్నికవడంతో సహచర పార్టీ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

## రీ సర్వే ప్రత్యేక ఫిర్యాదుల కేంద్రం సద్వినియోగం చేసుకోవాలి





కోవూరు, మే 6 ప్రభాతవార్త : కోవూరు మండలానికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రీ సర్వేకు సంబంధించి ప్రత్యేక ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నిర్మలానంద బాబా తెలిపారు. కోవూరులోని తాలూకా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక ఫిర్యాదుల కేంద్రంలో రైతులు పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు భూ వివాదాలకు సంబంధించిన శాంతి భద్రతలను పరిష్కరిస్తారన్నారు. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కారం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, డీఎస్పీ, ఇతర విభాగాధిపతులు కూడా హాజరవుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరానికి హాజరు కావాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## పాల ఉత్పత్తిపై వడగాల్పుల ప్రభావం

**కోవూరు, మే 6 ప్రభాతవార్త :**



ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పశువుల పాల ఉత్పత్తిపై వడగాల్పుల ప్రభావం ఉంటుందని దీని పట్ల పాడిరైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక వాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన శాంతినగర్‌లోని పశు వైద్యశాలలో పాడి పశువులకు జరుగుతున్న చికిత్సలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేసవిలో పాడి రైతులు పాడి పశువుల పోషణ, వాటి సంరక్షణలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గకుండా చూసుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రత వలన పశువుల్లో శ్వాసక్రియ రేటు పెరిగి జీర్ణ రసాయనాలు తక్కువగా ఉత్పత్తి అయి జీర్ణ ప్రక్రియ మందగిస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పాడి రైతులు తేలికగా జీర్ణమయ్యే ఎక్కువ శక్తి ఇచ్చే పిండి పదార్థాలను పెంచి సమతుల్య దాణాను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటనరీ అసిస్టెంట్ సజ్జాద్ అహ్మద్, పశు సంవర్ధక శాఖ సహాయకులు ఉన్నారు.

## శరవేగంగా పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు




**కోవూరు, మే 6 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో పడుగుపాడు సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇనమడుగు గ్రామంలో ఈ ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న స్థలంలో సొసైటీ పెట్రోల్ బంక్ చేపట్టాలని గతంలో తీర్మాణాలు చేసి సంబంధిత సహకార అధికారుల ద్వారా ఆమోదం పొంది ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంబించేలా తగు చర్యలు తీసుకుంటున్నట్లు సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు.

## కోరం లేక కావలి మండల సమావేశం వాయిదా

**కావలిరూరల్, మే 6 ప్రభాతవార్త**



కావలి మం డల పరిషత్ కార్యాలయం నందు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు ఆలూరి కొండమ్మ అధ్యక్ష తన మంగళవారం జరగవలసిన మండల పరి షత్ సాధారణ సర్వసభ్య సమావేశం ప్రారంభ మైంది. కోరం లేక వాయిదా పడింది. ఈ సమా వేశానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి చేవూరి శ్రీదేవి, మండలంలోని అన్ని శాఖల అధి కారులు, పంచాయితీ కార్యదర్శులు హాజరుకా వడం జరిగింది. సిరిపురం, తుమ్మలపెంట-2, సర్వాయపాలెం, ఎంపిటిసిలు హాజరుకావడం జరి గింది. తుమ్మలపెంట-1, ఆముదాలదిన్నె, అన్నగారి పాలెం-1, అన్నగారిపాలెం-2,తాళ్ళపాలెం,గౌరవరం, కొత్తపల్లి, చెన్నాయపాలెం, పెద్దపట్టపుపాలెం, మన్నం గిదిన్నె, చెంచుగానిపాలెం, ఆనెమడుగు, ఎంపిటిసిలు గైర్హాజరవడంతో కోరం లేక సమావేశాన్ని మండల పరిషత్ అద్యక్షురాలు ఆలూరి కొండమ్మ ఆదేశాలమేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి చేవూరి శ్రీదేవి వాయిదావేయడం జరిగింది. అనంతరం సమావేశాన్ని ఎంపిపి ఆలూరి కొండమ్మ ఆదేశాల ప్రకారం తేదీని నిర్ణయించి తెలియచేస్తామని ఎంపిడీఓ చేవూరి శ్రీదేవి తెలియచేశారు.

## కిషోర వికాసం - వేసవి శిక్షణాపై అవగాహన




**చేజర్ల మే 6 ప్రభాతవార్త** చేజర్ల మండలంలోని తూ ర్పు కంభంపాడు అంగన్ వాడీ కేంద్రంలో కిషోర వి కాసం - వేసవి శిక్షణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కిషోర్ వికాసం 30వ తేది వరకు 11 నుండి 15 సంవ త్సరాలు,16 నుండి 18 సంవత్సరాల బాలబాలి కలకు రెండు గ్రూప్ లుగా విభజించి అవగాహన కల్పించనున్నారు. ఈకార్యక్రమంలో బాల్య వివాహాలపై జరిగే దుష్ప్రాభావాలు,ఆడపిల్లలపై లింగ వివక్షత చూపించడం బాలల హక్కుల రక్షణ ,పోక్స్ చట్టంపై అవగాహన కల్పించనున్నారు.అలాగే కౌమర దశలో బాలబాలికలకు జరిగే పరిణామలపై అవగాహన కల్పించారు.వ్యక్తి గత పరిశుభ్రత గుడ్‌టచ్,బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. యనమదల గ్రామంలో ఉన్నఅంగన్‌వాడీ సెంటర్‌లో కిషోర వికాసం - వేసవి శిక్షణపై అవగాహన కల్పించారు. ఈకా ర్యక్రమంలో మహిళా పోలీసులు టి శైలజా,ప్రసన్న, అంగన్‌వాడీ వర్కర్స్ సిహెచ్ పద్మావతి వెంకటరత్న మ్మ,ఆశావర్కర్లు పద్మా ,వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## కిషోర బాలికల కు అవగాహన సదస్సు




మనుబోలు మే 6 ప్రభాతవార్త మనుబోలు మం డలంలోని బద్దెవోలు 2లోని అంగన్‌వాడీ సెంటర్ నందు సిడిపివో విజయలక్ష్మీ ఆదేశాల మేరకు కిషో ర బాలికలకు వేసవి శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో వ్యక్తిగత పరిశుభ్రత,బుతు స్రా వం సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు అంటు వ్యాధులు సోకకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు గు రించి వివరించారు. అలాగే విటమిన్స్ ఐరన్స్ స మృద్ధిగా లభించే ఆహారాన్ని తీసుకోవాలని వేసవికి మంచి నీరు మజ్జిగ లాంటి ద్రవ పదార్థాలు అధికం గా తీసుకోవాలని బాలికలకు వారి తల్లిదండ్రులకు తెలియజేయడం జరిగింది.ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ, కార్యకర్తలు రాధ, ఉమామహేశ్వరీ దొరసానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్దులకు చదువుతోపాటు యోగాసనాలు అవసరం




**మనుబోలు మే 6 ప్రభాతవార్త** మనుబోలు గ్రంధాలయంలో వేస వి విజ్ఞాన శిబిరాలలో భాగంగా గురువు పద్మశ్రీ అవార్డు గ్రహీత యోగా గురువు స్వామి శ్రీ శివా నంద బాబాకి శ్రద్ధాంజలి ఘటించి తదుపరి విద్యార్దుతో పుస్తక పట నం చేయించివారి చేత తోటి వి ద్యార్దులకు ముఖ్యాంశాలను వివ రించడం జరిగింది. పతంజలి యువభారత్ జిల్లా ఇంచార్జి యోగ ట్రైనర్ కోటేశ్వర్‌రెడ్డితో విద్యార్దులకు యోగసనాలు యోగా వ్యా యా మాలు చేయించడం జరిగింది. ఈకార్యక్రమంలో లైబ్రరియన్ అరుణ్‌కుమార్,సచివాలయం మహిళా పోలీ స్ సౌమ్య అంగన్‌వాడీ టీచర్ నిర్మల విజయమ్మ పాల్గొన్నారు.

## చెన్నకేశవస్వామి విగ్రహ

### ప్రతిష్ఠ మహాకుంభాభిషేకం కార్యక్రమానికి రూ.50వేలు విరాళం అందజేత



ఇందుకూరుపేట, మే 6, ప్రభాతవార్త ఇందుకూరుపేట మండలం నిడుముసలి గ్రామంలో శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠకు మహా కుంభాభిషేకం కార్యక్రమానికి నిడుముసలి సర్పంచ్ దువ్వూరు పావని మధుసూదన్‌రెడ్డి దంపతులు మంగళవారం రూ.50వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమీషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చిన సిఐటియు కార్మికులు



**కావలి, మే 6 ప్రభాతవార్త** మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సిఐటియు అనుబంధ కార్మికులు రాష్ట్ర పిలుపుమేరకు కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్‌కు మంగళవారం సిఐటియు నేతలు కలిసి సమ్మెనోటీసును అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్ మాట్లాడారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు చాలా రోజులనుంచి పరిష్కారం కాలేదన్నారు. గత సంవత్సరం 16 రోజుల సమ్మెకాలంలో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీని నేటికి అమలుకాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని 3 రోజులు సమ్మెను కొనసాగిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆప్కాస్ రద్దుచేసే ఆలోచన విరమించుకోవాలన్నారు. మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులను కూడా పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికుల పిల్లలకు ఉద్యోగాలివ్వాలన్నారు. కార్మికుల వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటి చెల్లించాలన్నారు. గత 17 రోజుల సమ్మెకు ఒప్పందాలను అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, యూనియన్ నాయకులు తురక శీనయ్య, ఎం.పోలయ్య, క్రాంతికుమార్, జె.బాబు, ఎం.భాస్కర్, ఒంగోలు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్‌ను తనిఖీ చేసిన పిసిసిఎఫ్ చలపతిరావు



**వెంకటాచలం మే 6 ప్రభావత వార్త** నెల్లూరు రేంజ్ పరిధిలోని కసుమూరు వద్ద ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ లో పరిధిలోనే వి ఎస్ ఎస్ ఆధ్వర్యంలో పెంచబడిన 40 హెక్టార్లో ఉన్న 2012-13 సంవత్సరములు యుక లిప్టస్ ప్లాంటేషన్ను మరియు 2013-14 సంవత్సరం ఎర్రచందనం 20 హెక్టార్ల ప్లాంటేషన్లను మంగళవారం పిసిసిఎఫ్ డాక్టర్ చలపతిరావు,గుంటూరు సిసిఎఫ్ ఐకెవి రాజు మరియు నెల్లూరు జిల్లా అటవీ శాఖ అధికారి కె.మహబూబ్ భాషా క్షుణ్ణంగా ఫారెస్టును తనిఖీ చేయడం జరిగింది. పోస్ట్ హార్వెస్టింగ్ జరిగిన ప్లాంటేషన్ నందు సింగిలింగ్ మరియు చెట్ల మధ్య దున్నకములను పరిశీలించడం జరిగింది. అక్కడక్కడ తిరిగి ఉన్న ముళ్ళ పొదలను తొలగించిన చో యూకలిప్టస్ మొక్కలు ఏపుగా పెరుగుతాయి అని సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది.ఫారెస్ట్ లో ఉన్న యూక లిప్టేషన్,ఎర్ర చందనం పై ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక బాధ్యత వహించి మొక్కల ఎదుగుదలకు కృషి చేయాలన్నారు జిల్లాలో ఉన్న అన్ని ఫారెస్టపై ప్రత్యేక శ్రద్ద వహించి బాధ్యతగా పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎఫ్ఆర్ఒఎస్ మాల్యాద్రి,ఎఫ్ఎస్ఒ ఎమ్.శ్రీనివాసులు మరియు వడ్లపూడి ఎఫ్బిఒ ఎస్.కె.రఫీ పాల్గొనడం జరిగింది.

## మంత్రిని కలిసిన వంశీకృష్ణారెడ్డి



**నెల్లూరు, మే 6, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల అభి వృద్ది శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని సచివాలయంలో వారి ఛాంబర్‌లో కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

## ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు చేసుకోవాలి : తహసిల్దార్



**కొడవలూరు, మే 6, ప్రభాతవార్త :** మండలంలో ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందాలంటే కచ్చితంగా ఆధార్ నమోదు చేసు కోవాలి తద్వారా పథకాల పంది అవకాశం ఉంటుందని తహసిల్దార్ తెలియజేశారు. మండలంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి





**కోవూరు, మే 6 ప్రభాతవార్త :** ప్రస్తుతం ఈ సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించేలా ఆరో గ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ హుస్సేనమ్మ తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగీ చికెన్ గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంచేలా చూడాలన్నారు. ముక్యంగా దోమలు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి అందులో స్ప్రేయింగ్ చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా దోమల వ్యాప్తిని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు పంచాయతీ సహకారంతో గ్రామాల్లో ఫాగింగ్ వంటి కార్యక్రమాలను చేపట్టేలా చూడాలన్నారు. ప్రతి ఆశా కార్యకర్త వారికి కేటాయించి విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వ హించా లన్నారు. ముఖ్యంగా మాతా శిశు సంరక్షణ పట్ల కూడా ఆశా కార్యకర్తలు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సీహెచ్ నిరంజన్, డాక్టర్ సయ్యద్ ఇక్బాల్‌లు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

**ల్యాబ్ సేవలు విస్తృతం చేయాలి** స్థానిక ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ల్యాబ్‌ను మంగళవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ల్యాబ్ సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. రికార్డు ల నిర్వహణ పక్కాగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ నాగరాజుకు సూచించారు.

## వైద్యాదికారిగా అనుపమ పశువైద్యశాఖలో ప్రమోషను



**వలేటివారిపాలెం మే 6 ప్రభాతవార్త** పశువైద్యశాఖలో జోన్-3లోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పనిచేస్తున్న సిబ్బందికి పదోన్నతి కల్పించారు.ఆయా జిల్లాల్లో లైవ్‌స్టాక్ అసిస్టెంట్లుగా పనిచేస్తన్న సిబ్బందికి జూనియర్ వెటర్నరీ అధికారులుగా పదోన్నతి కల్పిస్తూ ఆశాఖ డైరక్టర్ దామోదర్‌నాయుడు ఉత్తర్వులు జారీచేశారు.వలేటివారిపాలెం బి.అనుపమను ప్రకాశం జిల్లా కొలసనకోటకు,పి.అన్నపూర్ణను గంగవరంకు, బి.నాగకుమారిని బోగోలుకు, ఎం.సాగర్‌బాబును గుంటూరు జిల్లా మద్దిరాలకు,కె.శ్రీనివాసులును నెల్లూరు జిల్లా కొలగట్లకు,పిశివపార్వతిని గుంటూరు జిల్లా కూచిపూడికి, టి.సముద్రాలును గుంటూరు జిల్లా పోట్లూరుకు బదిలీ చేశారు.వీరంతా 15రోజులలోపు విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో డైరక్టర్ దామోదర్‌నాయుడు పేర్కొన్నారు.

## అడ్రస్‌లేని ఆయుర్వేద వైద్యశాల




**వలేటివారిపాలెం మే 6 ప్రభాతవార్త** ఉన్నతాధికారులు అశ్రద్ధ,నిర్లక్ష్యం కారణంగా మండలంలోని ఆయుర్వేద వైద్యకేంద్రం అనధికారికంగా మూతపడింది. నాలుగే ళ్లుగా వైద్యులు లేరు.కాంపౌండురు లేరు. కందుకూరు వైద్యులకి అదనపు బాధ్యతలు ఇచ్చారు.వారానికి మూడు రోజులు విధులు కేటాయించారు. దీనితో ఈ వైద్యశాల మూత పడింది. ఈ వైద్యశాల ఈ ప్రాంతంలో ఈ వైద్యశాల ఆవశ్యకత ఎంతో ఉంది. చిరునాలుక వ్యాధికి బాగా గుర్తింపు పొందింది. పశ్చిమ ప్రాంతంలోని ప్రజలు ఎక్కువగా ఆయుర్వేద వైద్యం ఉపయోగిస్తారు. గతంలో ఈ వైద్యశాలకు ఎంతో మంచి పేరుండేది. తాజాగా సిబ్బంది వైద్యులను నియమించకపోవడంతో ఈ వైద్యశాల దాదాపు మూతపడినట్లయింది. ప్రజలు తరచూ వచ్చి చూచి పోతూఉన్నార. వైద్యశాల తలుపు మూసివేయడం, తలుపు మీద వారానికి మూడు రోజులే అని రాయడం పలు విమర్శలకు తావిస్తొంది.






# అభివృద్ధిని గాలికొదిలేసి కుట్ర రాజకీయాలకు తెరలేపుతున్నారు

### కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ధ్వజం





**కావలి, మే 6 ప్రభాతవార్త** 'కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిని వదిలేసి కుట్రరాజకీయాలకు తెరలేపుతున్నారని వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కావలి ప్రతాప్ కుమార్‌రెడ్డి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఫోన్‌కాల్ ద్వారా మాట్లాడారు. కావలిలో ఎప్పుడూలేని విధంగా కక్షరాజకీయాలు ప్రోత్సహిస్తున్నారన్నారు. కావలి నియోజకవర్గంలో జరుగుతున్న గ్రావెల్ మాఫియా, ఇసుక మాఫియా, రేషన్‌బియ్యం మాఫియాలమీద ప్రశ్నిస్తుంటే అక్రమకేసులుపెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ముసునూరు అయ్యప్ప ఆలయం పక్కన ఉన్న స్థలం కబ్జా చేస్తే చూస్తూ ఊరుకున్నారన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డికి ప్రజలు 30వేల మెజార్టీ ఇచ్చింది రౌడీరాజకీయం చేయమని కాదని తెలిపారు. ప్రజలకు మంచి పరిపాలన అందిస్తారన్న భావనతో మెజార్టీ ఇచ్చారన్న విషయం మర్చిపోవద్దన్నారు. ప్రజాపాలన అందిస్తూ అందరి మన్నలను పొందాలన్నారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పందిటి కామరాజు, వైసిపి బోగోలు మండల అధ్యక్షులు వీరరఘుయాదవ్‌లు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిననాటినుంచి కావలిలో అరాచక పాలన సాగుతుందన్నారు. జలదంకి మండలంలో దగుమాటి ప్రదర్శించిన అరాచక సంస్కృతిని కావలిలో ప్రదర్శించాలని చూస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. కావలిని కాపుకాస్తానని చెప్పి కక్షరాజకీయాలకు తెరలేపుతున్నారన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలపై మీరుపెట్టే అక్రమకేసులకు భయపడే ప్రసక్తేలేదని, న్యాయంగా ఎదుర్కొంటామన్నారు. భారతదేశం మొత్తం అంబేద్కర్‌రాజ్యాం నడుస్తుంటే ఆంధ్రరాష్ట్రంలో ప్రత్యేకంగా కావలిలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నవారిపై అక్రమకేసులుపెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. 2020 సంవత్సరంలో దర్యాప్తుచేసి మూసివేసిన అమృతపథకం ఫైలాన్ కేసును ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రీఓపెన్ చేసి అరాచకాలకు పాల్పడడం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, వైసిపి నాయకులపై, జర్నలిస్ట్‌లపై అక్రమకేసులు బనాయించడం దారుణ మన్నారు. కూటమి నాయకుల దగ్గర మెప్పుకోసం అక్రమకేసులు బనాయిస్తున్న పోలీసు ఉన్నతాధి కారులకు ఒకటే చెబుతున్నామన్నారు. అధికారం శాశ్వతంకాదు, న్యాయంగా పనిచేయమని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రశ్నిస్తున్న మీడియా సోదరులపై దాడులు చేస్తూ అక్రమకేసులు బనాయిస్తూ రాక్షసానందం పొందడం ఏమిటన్నారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా నాయకులు నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి కామయ్య, కలికి శ్రీనివాసులురెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి, వేగూరి చిన్నపుల్లయ్య, గుర్రం వెంకటేశ్వర్లు (జివి), ఆత్మకూరు రాజేష్, ఇర్ల సురేష్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్ద రఫీ హత్యకేసు తప్పదారి పట్టించేందుకు యత్నాలు

### విలేఖర్ల సమావేశంలో మేనల్లుడి ఆవేదన



**బుచ్చి మే 6 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పోలినాయుడు చెరువు గ్రామానికి చెందిన పెద్ద రఫీ హత్య కేసును తప్పుదారి పట్టించేందుకు యత్నాలు జరుగుతున్నాయని తమకు అనుమానంగా ఉందని రఫీ మేనల్లుడు టిడిపి నేత ఫయాజ్ అనుమానం వ్యక్తం చేశారు. పోలినాయుడు చెరువు గ్రామంలోని ఆయన నివాసంలో బందువులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. హత్యను ప్రోత్సహించిన వారిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించి హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించినా ఆశించిన ఫలితం దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు నిష్పక్షపాతంగా కేసును దర్యాప్తు చేసి హత్య వెనుక ఉన్న పెద్దలను శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. హత్యలలో భాగస్వాములైన వారి వల్ల తమకు ప్రాణహాని ఉందన్నారు. హత్య జరిగిన నాటి నుండి టిడిపి నేత సూరా శ్రీనివాసులురెడ్డి తమకు అన్ని విధాలుగా అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. తాము వైసిపిలో నుండి టిడిపిలోకి వచ్చి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపు కోసం కృషి చేశామని తెలిపారు. హత్యకు గురైన రఫీ గతంలో వైసిపిలో ఉన్నా 2024 ఎన్నికల సమయంలో ఏ పార్టీ తరపున తిరగలేదని స్పష్టం చేశారు. కుటుంబపెద్దను పొగొట్టుకొని ఆ కుటుంబం కష్టాల పాలైందని అన్నారు. హత్యకు గురైన రఫీ సతీమణి కుమార్తెలు తిండి తిప్పలు మానేసి అనారోగ్యం బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జిల్లా ఎస్పి ,చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో షేక్.షబ్బీర్, షేక్ ,రఫీ, షేక్ నాగూరుబాషా, షేక్.మస్తాన్, షేక్ .షాహుల్, షేక్.సలాం ఉన్నారు.

# వేసవిలో ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

### ఏ సమస్య ఎదురైనా వైద్యశాలను సంప్రదించండి



**వలేటివారిపాలెం మే 6 ప్రభాతవార్త** వేసవికాలం దృష్ట్యా ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డా॥ శివ మరియు సీహెచ్‌వో పి.శివరామయ్యలు ప్రజలకు సూచించారు.సుశిక్షితులైన వైద్య సిబ్బంది,అధునాతన వ్యాధినిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు.వీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు.ఏ ఆరోగ్య సమస్య ఎదురైనా స్థానిక ఆరోగ్యకేంద్రాన్ని సంప్రదించాలని వారు ప్రజలకు విజ్ఞప్తిచేశారు.మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో తమను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలంలో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే అనేక కష్టనష్టాలు ఎదుర్కొవాల్సి వస్తుందని వివరించారు.ఇందుకోసం తీసుకోవాల్సిన జాగ్రర్తలు సూచించారు.ప్రధానంగా రైతులు, కూలీలు తమ పనులను చల్లని సమయాలలో పూర్తిచేసుకోవాలన్నారు.వీలైనంతవరకు విశ్రాంతి తీసుకోవాలన్నారు.కాటన్ దుస్తులు దరించాలన్నారు.ప్రధానంగా వయోవృద్దులు రోగులు,ది వ్యాంగులు ,చిన్నారులు, గర్భవతులు బాలింతలు ఎండ తప్పిం చుకోవాలన్నారు.మజ్జిగ,ఓఆర్ఎస్ తదితర ద్రవ పదార్ధాలనుతీసుకోవాలన్నారు. స్థానిక ఆరోగ్యకేంద్రంలో ఇద్దరు డాక్టర్లు,ముగ్గురు స్టాప్ నర్సులు,లాబ్ టెక్నీషియన్,అన్ని రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.డాక్టర్లు,ఒక సీహెచ్‌వో పర్యవేక్షణలో మండలంలోని 15సచివాలయాల పరిధిలోని 37నివాస ప్రాంతాలలో 14మంది ఏఎన్ఎంలు, 37మంది ఆషావర్కర్లు,ముగ్గురు సూపర్‌వైజర్లు,ఒక పబ్లిక్ హెల్త్ నర్సు పనిచేస్తున్నట్లు తెలిపారు.కమ్యూనిటీ నాన్‌క మ్యూనిటీ వ్యాధుల గుర్తింపు కొరకు జరుగు తున్న సర్వే తుదిదశలో ఉందన్నారు.ఈ సర్వేద్వారా నోటి క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్,గర్భాశయ క్యాన్సర్ వ్యాధిలక్షణాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. అనుమానిత లక్షణాలను ముందుస్తుగా గుర్తించి వ్యాధినిర్ధారణ మరియు చికిత్సనిమిత్తం నెల్లూరుకి పంపనున్నట్లు డాక్టర్ శివ తెలిపారు.తద్వారా క్యా న్సర్ బారినుండి ప్రజలు రక్షించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోగల టీబీ వ్యాధి పేషంట్లు నుంచి తమ కుటుంబ సభ్యులకు సంక్రమించ కుండా నివారణ చర్యల్లో బాగంగా సీవైటీబి స్కిన్ టెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు.స్థానిక ఆరోగ్యకేంద్రంలో నిపుణల పర్యవేక్షణలో ప్రసవాలు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి నెలలో బుధ, శనివారాలలో వ్యాది నిరోధక టీకాలు,3వ బుధవారం టీటీ వ్యా ధికి టీకాలు వేయిస్తున్నట్లు చెప్పారు.సుమారు 200 మంది గర్భవతులుకు క్రమతప్పకుండా వైద్యసేవలు అందిస్తున్నట్లు సీహెచ్‌వో శివరామయ్య వివరించారు. రోగులను చేస్తున్నట్లు తెలిపారు.

## అంకురార్పణతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

**నెల్లూరు రూరల్, మే 6, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. నెల్లూరు రూరల్ నరసింహకొండలో వెలిసి ఉన్న శ్రీ వేదగిరి లక్ష్మినరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 6వ తేదీ అంకరార్పణతో అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆలయ అర్చకులు సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కాగలరని తెలిపారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, మే 6 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళ వారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూ జలను సాంప్రదా యబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని కనులపండువగా చేపట్టారు. రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## నేడు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జన్మదినోత్సవ వేడుకలు



**కోవూరు, మే 6 ప్రభాతవార్త :** కోవూరులోని రైల్వే రోడ్డులో వెలసి ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో బుధవారం అమ్మవారి జయంతి సంద ర్భంగా ఉదయం 9 గంటలకు సామూహిక లక్ష కుం కు మార్చన నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా తెలియ జేశారు. అమ్మవారి జన్మదినోత్స వం సందర్భంగా అ మ్మవారు బంగారు చీరతో దర్శనమిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసా దాలు స్వీకరించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

